# రెన్యువల్ పేరుతో వసూళ్లు

- పంట రుణాలకు ఒక్కో రైతు నుంచి రూ. 800
- సిబిల్ స్కోర్‌కు రూ.300, సర్వీస్ చార్జీకి రూ.500
- ఇప్పటికే 10 శాతం డిపాజిట్.. రెన్యువల్ చేస్తే మళ్లీ కట్టాలట?



నర్సింహులపేట పీఏసీఎస్‌లో రుణమాఫీ అయి రెన్యువల్ కోసం వచ్చిన రైతులు

నర్సింహులపేట, జూలై 24 : నర్సింహులపేట పీఏసీఎస్ పరిధిలో పంట రుణాల రెన్యువల్‌లో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో రైతు నుంచి రూ. 800 ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. పీఏసీఎస్ పరిధిలోని నర్సింహులపేట, దంతాలపల్లిలో రూ.లక్ష పంట రుణం తీసుకున్న రైతులు 1543 ఉండగా, 501 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. గతంలో రుణం తీసుకున్నప్పుడే సొమ్ము నుంచి 10శాతం బ్యాంక్‌లో డిపాజిట్ చేయించుకుని రైతులకు నగదు అందించారు. డిసెంబర్ 2023 వరకు రూ.లక్ష పంట రుణం తీసుకున్న రైతులకు సంబంధించిన జాబితా ఆధారంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. డిసెంబర్ నుంచి జూలై వరకు రుణాలకు వడ్డీ వసూలు చేయడంతోపాటు పంట రుణం రెన్యువల్ చేయాలంటే సిబిల్ స్కోర్‌కు రూ.300, సర్వీస్‌చార్జీకి రూ.500 వసూలు చేస్తున్నారు. వాటికి ఎలాంటి రసీదు కూడా ఇవ్వడం లేదు. ఇప్పటికే 10 శాతం డిపాజిట్ చేసుకున్న డబ్బులు విషయంపై ఎలాంటి వివరాలు చెప్పడం లేదని, మళ్లీ రెన్యువల్ చేసుకున్న డబ్బులకు 10శాతం డిపాజిట్ చేసుకుంటామని సిబ్బంది చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇలా పంట రుణం ఇచ్చిన సమయంలో 10శాతం డిపాజిట్ చేసుకుంటూపోతే తమకు మిగిలేది ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

## రెన్యువల్‌కని రూ. 800 తీసుకున్నరు



నేను డీసీసీ బ్యాంక్‌లో రూ.45 వేలు పంట రుణం తీసుకున్న. అప్పుడు రూ.4500 డిపాజిట్ పేరుతో నాకు రూ.40,500 ఇచ్చిన్రు. ఇప్పుడు ప్రభుత్వం మాఫీ చేసిన పంట రుణంలో నా పేరు వచ్చింది. దీంతో సంతోషంగా పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్తే డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రూ.2050 వడ్డీ తీసుకున్నరు. రెన్యువల్ చేయమంటే సిబిల్ స్కోర్‌కు రూ.300, సర్వీస్ చార్జీ రూ.500 అడుగుతున్నరు. లేకపోతే చేయమంటున్రు. రూ.800 ఇచ్చినా రసీదు ఇత్తలేరు. మళ్ల రెన్యువల్ చేస్తే మళ్ల డిపాజిట్ కట్టాలంటున్నరు. గతంలో రూ.4500 సంగతేంటని అడిగితే తెలువదని చెబుతున్రు. – మేకల శ్రీనివాస్, రైతు, రామన్నగూడెం

## లంచం తీసుకుంటే సస్పెండ్ చేస్తా..

### ఏజీఎం కృష్ణ మోహన్



పీఏసీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏజీఎం కృష్ణమోహన్

నర్సింహులపేట, జూలై 24 : రైతుల వద్ద లంచం తీసుకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని డీసీసీబీ ఉమ్మడి జిల్లా ఏజీఎం కృష్ణమోహన్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రైతు వద్ద సిబిల్ స్కోర్ పేరుతో రూ.300, సర్వీస్ చార్జీ పేరుతో రూ.500, రెన్యువల్ పేరుతో వడ్డీ వసూలు చేయవద్దని, రుణాలు తీసుకున్న రైతులు ఎక్కువ రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే ఎక్కువ ఇచ్చే డబ్బులకు మాత్రమే షేర్ అమౌంట్ తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బులు తీసుకున్న ప్రతి దానికి రసీదు ఇవ్వాలన్నారు. ఆయనతో సీవో వెంకన్న ఉన్నారు.

## ఆర్డీవో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరి మృతి

గణపురం, జూలై 24: మండలంలోని చెల్పూర్ పరిధిలోని పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారి కొంపల్లి క్రాస్ వద్ద మంగళవారం భూపాలపల్లి ఆర్డీవో వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పుల్లూరు రామయ్య పల్లెకు చెందిన పర్శ సంపత్, కొంపెల్లి గ్రామానికి చెందిన సడాల ఎల్లయ్య తీవ్రంగా గాయపడగా, చికిత్స పొందుతూ బుధవారం ఎల్లయ్య మృతి చెందా డు. సంపత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## విషజ్వరంతో మహిళ ..

వాజేడు, జూలై 24 : వాజేడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన బొగ్గుల కాంచన(50) బుధవారం విషజ్వరంతో మృతిచెందింది. జ్వరం రావడంతో మూడు రోజుల నుంచి ఏటూరునాగారంలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతోంది. మెరుగైన వైద్యం కోసం బుధవారం భద్రాచలం వైద్యశాలకు తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

















